క్లుప్తంగా

సుబ్రహ్మణ్య గురుస్వామి సేవలు మరువలేనివి

నందిగామ: సుబ్రహ్మణ్య గురు స్వామిని నందిగామ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని ఎస్‌హెచ్‌ఓ సతీష్ అన్నారు. తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్య గురుస్వామి ఈనెల 20న మృతి చెందారు. నందిగామ ప్రాంతంలో అయ్యప్ప మాలధారులకు గురుస్వామిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ పట్టణానికి చెందిన కొప్పు రమేష్ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని చందర్లపాడు బస్టాండ్ వద్ద సంతాప సభ, భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణానికి చెందిన పలువురు గురుస్వాములు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నందిగామ ప్రాంతంలో గత 40 సంవత్సరాలుగా సుబ్రహ్మణ్య గురుస్వామి అయ్యప్ప మాలధారులకు చేసిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేనివన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన గురుస్వాములు మేకల మౌళి, ఏచూరి శ్రీనివాసరావు, సముద్రాల నరసింహారావు, కమతం వెంకటేశ్వరరావు, నాగయ్య, పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఆశయ నాయక్

వీరులపాడు: మండల తహసీల్దార్‌గా ఆశయ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన గుడిసె విక్టర్‌బాబు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై ఏలూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో తహసీల్దార్‌గా ఆశయ నాయక్ బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ ఉద్యోగులు, ఆయా పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కంచికచర్ల(వీరులపాడు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామాలలో క్షేత్ర స్థాయిలో గ్రామ సభలు నిర్వహించినట్టు ప్రిసైడింగ్ అధికారి మునికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020–22 వరకు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు, సామగ్రి నిమిత్తం రూ.11.84 కోట్లను ఖర్చు చేశామన్నారు. వీటితో పాటు జరిగిన పనులకు సంబంధించి ఈ నెల 17వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి కూలీలతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీడీవో శిల్ప, శరత్‌బాబు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నందిగామ: నందిగామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పండుదొర తెలిపిన సమాచారం ప్రకారం జగ్గయ్యపేట మండలం బూదవాడకు చెందిన పలువురు మహిళలు చందర్లపాడు మండలంలో జరుగుతున్న ఓ వేడుకకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరి వస్తుండగా జాతీయ రహదారిపై దారితప్పి ఫ్లైఓవర్ పైకి వెళ్లిన ఆటోను డ్రైవర్ యూటర్న్ తిప్పాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న బైకు ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సీహెచ్ ఈశ్వరమ్మ (36)కు తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈశ్వరమ్మను విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొనసాగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు



నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన సోమవారం అమ్మవారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు, లలితా సహస్ర నామ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మహా కుంభాభిషేకం

కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా అమ్మవారికి, ఆలయ ప్రధాన శిఖరాలకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

గాంధీజీ కల నెరవేరుస్తున్న సీఎం జగన్



నందిగామలో మహాత్ముని చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

- గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి
- మహాత్మునికి నివాళులర్పించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీ సెంటరులోని మహాత్ముని విగ్రహానికి కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు గుడివాడ సాంబశివరావు, దాసు, మారం అమరయ్య, నల్లమల్లి మురళి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, అచ్చి చిన్నబాబు, చిలుకూరి బుచ్చిరెడ్డి, వీసం దుర్గారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల(వీరులపాడు): మహాత్మా గాంధీ చూపిన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుచుకుంటూ గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, అహింస అనే ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు మాడుగుల మధు, మేకల బాబు, తంగిరాల సుజని, వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఎం.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతిపిత వర్ధంతి

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల జరిగిన కార్యక్రమాల్లో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. నందిగామ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో, పాఠశాలల్లో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో రవీంద్రరావు జాతిపిత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం

కాడ కమిషనర్



రైతులతో మాట్లాడుతున్న కాడ కమిషనర్

నందిగామ: ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని, అందులో భాగంగానే రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడ) కమిషనర్ షాబుద్దీన్ తెలిపారు. జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న నందిగామ మండలంలోని గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రూ.62 కోట్లతో పోలంపల్లి మునేటి కాలువపై ఏర్పాటుచేసిన లైనింగ్ కెనాల్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పనులు పూర్తయిన మొదటి ప్రాజెక్టు కావడంతో తాను స్వయంగా పరిశీలించి రైతుల అభిప్రాయాలు సేకరించేందుకు వచ్చానన్నారు. లైనింగ్ కెనాల్ ఏర్పాటు ద్వారా రైతులకు సకాలంలో పంట పొలాలకు నీళ్లు అందుతాయన్నారు. మొత్తం రూ.62 కోట్లతో 42 కిలోమీటర్ల పైన మున్నేటి కాలువపై అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇవన్నీ కూడా ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చేస్తోందన్నారు. అనంతరం కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో పలువురు రైతులు పూర్తయిన పనులతో పాటు మిగిలి ఉన్న ఏడు కిలోమీటర్లకు పైగా ఉన్న కాలువపై పనులకు రూ.4.8 కోట్లు మంజూరు చేయాలని, ముఖ్యంగా కాలువలపై పర్యవేక్షించేందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని, తలువుల బంధం నుంచి కూచిబాబు కోడుకు తీత పనులు చేయించాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చేసిన కృషి, పట్టుదలను అధికారులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్నేరు సబ్ డివిజన్ డీఈ ఎస్.రామకృష్ణ, సిబ్బంది ప్రసన్నలక్ష్మి ప్రశాంతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన

ఆర్డీఓ రవీంద్రరావు



స్పందనలో అర్జీలు అందజేసేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కావాలంటే స్పందన కార్యక్రమం ద్వారానే సాధ్యమని ఆర్డీఓ రవీంద్రరావు అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు 9 అర్జీలను అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి మూడు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరమైన వారు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు సైతం స్పందన ద్వారా పరిష్కారం అవుతున్నాయన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై చైర్‌పర్సన్ ఆగ్రహం

- బాధ్యులపై చర్యలకు ఆదేశం
- వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం

నందిగామ టౌన్: నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో సోమవారం జరగాల్సిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ జయరాం తెలిపారు. సమావేశం ప్రారంభమవగానే అజెండా కాపీలను తమకు అందించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని సమావేశాన్ని వాయిదా వేయాలని చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి కోరటంతో కమిషనర్ సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం నిర్వహించేందుకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, కౌన్సిల్ సభ్యులు సమావేశం కాగానే సమావేశంలో పొందుపరిచిన అంశాలకు సంబంధించిన అజెండా కాపీని సంబంధిత అధికారులు తమకు అందించలేదని ఆమె అక్కడే ఉన్న కమిషనర్‌కు తెలిపారు. వెంటనే ఇందుకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గడపగడపకూ సంక్షేమం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత, పార్టీ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయాలతో సాహసోపేత పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నామినేటెడ్ పదవులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని రానున్న ఎన్నికల్లో కూడా ఆయన్ను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు మాడుగుల మధు, మేకల బాబు, తంగిరాల సుజని, వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఎం.పాండు రంగారావు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జగ్గయ్యపేట: పట్టణంలోని చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలోని ఆక్రమణల తొలగింపు కార్యక్రమం అధికారులు సోమవారం చేపట్టారు. ఆలయ వెనుక భాగంలోని స్థలంలో కొందరు ఆక్రమించారు. అయితే ఆలయ కల్యాణ మండపం ఏర్పాటు నేపథ్యంలో ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు పర్యవేక్షణలో ఏఎస్ఐలు శంకర్, నాగేశ్వరరావుల భద్రత నడుమ ఆక్రమణలు తొలగించారు. స్థలంలోని కొందరు 20 ఏళ్లుగా ఉంటున్నామని అధికారులు తమకు దారి చూపాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు బడ్జెట్, అలాగే మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని తెలిపారు. పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 27 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కావున గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట-చిల్లకల్లు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా జగ్గయ్యపేట -చిల్లకల్లు మధ్య రూ. 14 కోట్లతో చేపట్టిన ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులో తీసుకువచ్చేందుకు కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ పందుల రోశయ్య, నాయకుడు పాటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఇంటింటి సర్వే



సర్వే పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీం సర్వే గ్రామంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయచంద్ర మాట్లాడుతూ మండలంలో 13,691 కుటుంబాలున్నాయని వీరిలో ఇప్పటి వరకు 60 శాతం మందికి ఈకేవైసీ పూర్తయ్యిందని తెలిపారు. గ్రామ వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 2011 జనాభా లెక్కల ప్రకారం సర్వే చేస్తున్నారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్స్యూరెన్స్ స్కీం ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ. ఐదు లక్షల ఇన్స్యూరెన్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఫణి, నాయక్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు



జగ్గయ్యపేట అర్బన్: కుష్ఠు వ్యాధి ఎండీటీ చికిత్సా విధానంతో పూర్తిగా నయం అవుతుందని ప్రభుత్వాస్పత్రిలోని పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాణి తెలిపారు. పట్టణంలో సోమవారం జరిగిన కుష్ఠు వ్యాధి పై విస్తృత ప్రచార కార్యక్రమం-స్పర్శ పక్షోత్సవాలు 2023 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. స్థానిక మిట్టగూడెంలో జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వాసంతి, హెల్త్ విజిటర్ జానకి, స్టాఫ్ నర్సు పార్వతి, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గండ్రాయి(జగ్గయ్యపేట): పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట జరుగుతున్నట్లు చిల్లకల్లు ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు సమాచారం రావటంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి, 10 మంది వ్యక్తులు, రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిరుధాన్యాల సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయంలో అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవం సందర్భంగా చిరు ధాన్యాలపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతతూ ప్రభుత్వం చిరు ధాన్యాల కొనుగోలు కేంద్రాలను రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిందన్నారు. క్వింటాకు రూ. 2,500 మద్దతు ధర కల్పిస్తోందని చెప్పారు. చిరుధాన్యాల పంటలైన జొన్న, రాగి, సజ్జ, కొర్రలు, సామ, అరికె, ఊదలు, తదితర చిరుధాన్యాలు అన్ని వ్యవసాయ వాతావరణ పరిస్థితులలో పండుతాయన్నారు. చిరుధాన్యాల పంటలకు కూడా పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త వెంకట సుబ్బయ్య, ఏవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో సత్తాచాటిన డివిజన్ ఉద్యోగులు



ఆర్చరీలో బంగారు, కాంస్య పతకాలు సాధించిన చరణ్‌రెడ్డి, సునేందురాయ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్ ఉద్యోగులు ఒక బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు చిత్తరంజన్‌లో జరుగుతున్న 12వ ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో కమర్షియల్ విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.చరణ్‌రెడ్డి, ఎస్ అండ్ టీ విభాగంలో హెల్పర్ సునేందురాయ్ దక్షిణ మధ్య రైల్వే ఆర్చరీ టీంకు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో చరణ్‌రెడ్డి ర్యాంకింగ్ రౌండ్‌లో బంగారు పతకం సాధించగా, ర్యాంకింగ్, ఎలిమినేషన్ (ఒలింపిక్) రౌండ్‌లో సురేందురాయ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. డీఆర్ఎం శివేంద్రమోహన్, ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

అధికారులకు సత్కారం



అవార్డులు అందుకున్న అధికారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

వత్సవాయి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న తహసీల్దార్ వైకుంఠరావు, ఎంఈవో ఎల్. నాగరాజు, హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావులను సన్మానించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నేతలు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పీడీవీ ప్రసాదరావు, పూర్ణయ్య, మోంగ్యానాయక్, ముక్కా సత్యనారాయణ, అజ్మీరు కొండ, హుస్సేన్, ఏ గోవిందరాజులు పాల్గొన్నారు.

అహింసా మార్గం అనుసరణీయం



గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్ : ఆయుధాలతో హింసా మార్గంలో సాధించలేనిది, శాంతియుతంగా, అహింసా మార్గం ద్వారా సాధించవచ్చని ప్రపంచ దేశాలకు ఆచరించి చూపిన మహానేత మహాత్మా గాంధీ అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక పురపాలకసంఘ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహాన్ని పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి చైర్మన్ పూలమాలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ కన్న కలలు గ్రామ స్వరాజ్యం సాకారం చేసేందుకు ఈరోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ఆయన ఆశయాల సాధనలో ముందుకు పోతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ), కౌన్సిలర్లు నూకల సాంబ, గింజుపల్లి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి ఆ పార్టీ పట్టణ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహాత్ముని బాటలో పయనించాలి

వత్సవాయి : జాతిపిత మహాత్మగాంధీ చూపిన బాటలో పయనించాలని పలువురు వక్తలు సూచించారు. మహాత్ముని వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వైకుంఠరావు, ఎంఈవో ఎల్. నాగరాజు, స్టేషన్‌లో ఎస్ఐ బి. అభిమన్యు, గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వత్సవాయిలోని గాంధీ పార్కు సెంటర్‌లోని ఉన్న జాతిపిత విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు పూలమాలవేసి నివాళులర్పించారు. సంఘ పెద్దలు పోలా పూర్ణయ్య, గుర్రం కృష్ణమూర్తి, కొత్తా గోవిందరావు, దుగ్గి బాబీ, బీఎస్ చక్రవర్తి, చిరునోముల రమేష్ పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

పెనుగంచిప్రోలు: మహాత్మా గాంధీజీ చూపించిన అహింసా మార్గం అనుసరణీయమని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహాత్ముని ఆశయాలు యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్దారెడ్డి, ఈఓపీఆర్‌డీ సీహెచ్ వీరభద్రరావు, గ్రామ కార్యదర్శి కొండలరావు, మాజీ సర్పంచ్ భూమన సత్యనారాయణ పాల్గొన్నారు.